జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

గురువారం | 30-4-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 659 పేజీలు: 4 వెల : రూ.7

## రెప్పపాటులో..

# ఘోరం

✳ భోగాపురం వద్ద లారీని ఢీకొన్న బైక్ ✳ అక్కడికక్కడే ముగ్గురు మృతి
✳ దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా ఘటన ✳ ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం ✳ కన్నీరుమున్నీరవుతున్న ఆయా కుటుంబీకులు
✳ రక్తమోడుతున్న జాతీయ రహదారి ✳ వరుసగా రెండు రోజుల వ్యవధిలో ఏడుగురు మృతి ✳ అతివేగం ప్రమాదకరమని హెచ్చరిస్తున్న పోలీసులు
✳ అయినా పట్టించుకోని వాహనచోదకులు









శ్రీకాకుళం క్రైం, ఏప్రిల్ 29 (వార్త): రెప్పపాటులో ఘోరం మూడు నిండు ప్రాణాలను బలిగొంది. దైవదర్శనం చేసుకుని ఇంటికి వస్తున్న సమయంలో లారీని వెనుక నుంచి బలంగా బైక్ ఢీకొనడంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన భోగాపురం వద్ద బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం ఫరీదుపేటకు చెందిన సంచాన సాయికుమార్(24), గార మండలం దీపావళి గ్రామానికి చెందిన లావేటి చిన్నమ్మలు(45), సీహెచ్ రుత్విక(4)లు బుధవారం ఉదయం బైక్‌పై సింహాచలం దేవస్థానానికి వెళ్లారు. స్వామి వారి దర్శనం అనంతరం తిరుగుప్రయాణమయ్యారు. భోగాపురం సచివాలయం సమీపానికి వచ్చేసరికి అకస్మాత్తుగా ఆగి ఉన్న లారీని ఢీకొన్నారు. దీంతో బైక్‌పై ఉన్న వారంతా రోడ్డుపై పడిపోయారు. బలమైన గాయాలు కావడంతో వారంతా అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. స్థానికులు దీన్ని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. సీఐ కె.దుర్గాప్రసాదరావు, ఎస్ఐలు వి.పాపారావు, పి.సూర్యకుమారి పోలీస్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని, వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఎడిషనల్ ఎస్పీ(అడ్మిన్) పి.సౌమ్యలత, ఇన్‌చార్జి డీఎస్పీ రాఘవులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదంపై ఆరా తీశారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడంతో ఫరీద్‌పేట, దీపావళి గ్రామాల్లో విషాదఛాయలు అలముకున్నాయి. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘోర ప్రమాదంపై కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## పశువుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట

✳ ఆరు పశువులను పట్టుకున్న జలుమూరు పోలీసులు ✳ వాహనం స్వాధీనం
✳ నిత్యం సంతల నుంచి పశువుల అక్రమంగా తరలింపు



## తనయుడు చితికి నిప్పు పెట్టిన తల్లి



లోపల పేజీల్లో

## నేడు 'పది' ఫలితాలు

శ్రీకాకుళం, ఏప్రిల్ 29(వార్త): ఏపీలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలను గురువారం ఉదయం 11 గంటలకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విడుదల చేయనున్నారు. మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు ఏపీ టెన్త్ పరీక్షలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 6.30 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 25,598 మంది పరీక్షలు రాశారు. పరీక్షా ఫలితలు తెలుసుకోవడానికి వాట్సాప్ నెంబరు 9552300009 నంబరుకు హాయ్ అని టైప్ చేసి పంపితే వెంటనే మార్కుల జాబితా వస్తుంది. అలాగే పది ఫలితాలను https://www.bse.ap.gov.in/ ఏపీ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# 1న రైల్వే అండర్‌బ్రిడ్జిలకు కేంద్ర మంత్రి రాము శంకుస్థాపన



**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 29(వార్త):** కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని పలు రైల్వే అండర్‌బ్రిడ్జిల నిర్మాణానికి మే 1న శంకుస్థాపన చేస్తారని జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడు శ్రీనివాస్ రౌలో ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందా ళం అశోక్‌తో కలిసి ఆయన ఈ రైల్వే ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్స వాలు చేస్తారని చెప్పారు. ఇటీవల మంజూరైన ఆర్‌వోబీలు కవిటి మండలం కరా పాడు వద్ద శంకుస్థాపన, జాడుపూడి రైల్వేస్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి ప్రారంభోత్స వం, ఆర్‌వోబీకి శంకుస్థాపన, బసవకొత్తూరు ఎల్‌సీ గేట్ వద్ద శంకుస్థాపన, కొర్లాం వద్ద మరో ఆర్‌వోబీకి శంకుస్థాపన చేస్తారని తెలిపారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా చూడాలి



**పలాస, ఏప్రిల్ 29 (వార్త):** మే 9 న జరగబోయే జాతీయ లోక్ అదాలత్ లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలని జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ యు. మాధురి ఆదేశించారు. బుధవారం పలాస కోర్టులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, కాశీబుగ్గ, వజ్రపు కొత్తూరు పోలీసు అధికారులు, పలాస ఎక్సైజ్ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధిక సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలని, అదేవిధంగా కేసులలో చర్చలు జరిపి రాజీ చేయాలని న్యాయమూర్తి తెలియజేశారు. కాశీబుగ్గ, వజ్రపు కొత్తూరు పోలీస్ అధికారులు సిబ్బంది తక్షణమే చర్యలు చేపట్టి ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలని, ఎక్సైజ్ కేసులు కూడా ఎక్కువగా పరిష్కారం అయ్యేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి. రమేష్, కాశిబుగ్గ ఎస్ ఐ ఎన్ సునీల్, వజ్రపు కొత్తూరు, కాశిబుగ్గ పోలీసు సిబ్బంది, ఎక్సైజ్ ఎస్ఐ తదితరులు పాల్గొన్నారు.

## గౌతు శివాజీకి మెడికల్ సిబ్బంది సన్మానం



**సోంపేట, ఏప్రిల్ 29 (వార్త):** మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీకి మెడికల్ సిబ్బంది బుధవారం సన్మానం నిర్వహించారు. సిబ్బంది విషయంలో ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తూ నిరంతరం అండగా ఉంటున్న శివాజీ పట్ల సిబ్బంది తమ అభిమానాన్ని చాటుకున్నారు. రెగ్యులరైజేషన్ విషయంలోను మెడికల్ సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జై కుమార్ వర్మ బాల మురళి శేషగిరి శ్రీనివాస్ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించండి: గ్రీన్ ఆర్మీ




**మందస, ఏప్రిల్ 29(వార్త):** మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని గ్రీన్ ఆర్మీ ప్రతినిథులు కోరారు. మందస మండలంలోని పిడిమందస గ్రామంలో శ్రీకిల్లమ్మ తల్లి ఆలయ ప్రతిష్ట సందర్భంగా గ్రీన్ ఆర్మీ, గ్రామ పెద్దలు, యువత కలసి ఆలయ ప్రాంగణంలో బుధవారం మొక్కలు నాటారు. మందస మండల పరిసర గ్రామాల్లో పిడి మందస, సాబకోట, మందస గ్రామాల్లో శ్రీకిల్లమ్మతల్లి మహోత్సవాలు ప్రతీ ఏటా దసరా సందర్భంగా జరుపుకొంటారు. ఈ అమ్మవారికి చాలా ప్రత్యేకత ఉందని పరిసర ప్రాంత గ్రామస్తులందరూ విశ్వసిస్తారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఎండోమెంట్ డిపార్ట్మెంట్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున మూడు రోజులపాటు ప్రజల తండోపతండాలుగా వచ్చారు. కార్యక్రమంలో కలెక్టర్లు సేనాపతి ఢిల్లీశ్వరరావు, ప్రశాంతి, ఏపీ ఎన్జీవో, గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనేల గోపాల్, ఉపాధ్యాయులు గేదెల జగదీశ్వరరావు, బురద హరిబాబు, శిష్టు కూర్మారావు, ఎక్సైజ్ డిపార్ట్మెంట్ ధర్మారావు, రాజకీయ ప్రముఖులు, గ్రామ ప్రజలు, యువత తదితరులు పాల్గొన్నారు.

## శక్తి యాప్‌ని సద్వినియోగం చేసుకోండి

**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 29(వార్త):** రాష్ట్ర ప్రభుత్వం మహిళా రక్షణ కోసం పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రవేశ పెట్టిన శక్తి యాప్ ని సద్వినియోగం చేసుకోవాలని అవగాహన కల్పించారు. జిల్లా ఎస్ పి ఆదేశాల మేరకు సి ఐ చిన్నం నాయుడు పర్యవేక్షణ లో మహిళ లకు శక్తి యాప్ వినియోగం పై అవగాహన కల్పించారు. రూరల్ పోలీస్ స్టేషన్ మహిళా పోలీస్ బొడ్డ అనూష డైలీ మార్కెట్, బస్ స్టాండ్ ఇతర ముఖ్య కూడళ్లలో మహిళలు మొబైల్ ఫోన్ లో శక్తి యాప్ డౌన్ లోడ్ చేసి వాటి వినియోగం, పని చేసే విధానం మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సైబర్ మోసాలు పట్ల అవగాహన కల్పించారు.



# ఎంత కష్టమొచ్చిందమ్మా..!

### -కన్న కొడుకు మృతదేహానికి కొరివి పెట్టిన తల్లి



**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 29(వార్త):** బూర్జపాడు గ్రామానికి చెందిన బంగ యోగి (15) అనే బాలుడు కొద్ది నెలలుగా కిడ్నీ వ్యాధి బారిన పడి డయాలసిస్ చేసుకుంటున్నాడు. బుధవారం ఇంట్లో ఉండగానే హఠాత్తుగా హైబీపీ రావడంతో కుప్పకూలిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు హుటాహుటిన శ్రీకాకుళం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు తండ్రి సింహాచలం వలస కూలీ కావడంతో విదేశాల్లో ఉన్నారు. తల్లి దేవి గృహిణి, మృతుడు తండ్రి అందు బాటులో లేకపోవటంతో తల్లి కుమారుడు చితికి నిప్పటించారు. చేతికందివచ్చిన కొడుకు మృతి చెందడం తట్టుకోలేకపోయిన ఆమె కన్నీరుమున్నీరయ్యింది. ఆమెను చూసి గ్రామస్థులంతా కన్నీరు పెట్టుకున్నారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కన్నకొడుకు చితికి నిప్పటించే దుస్థితి వస్తుందని ఎప్పుడూ అనుకోలేదని ఇలాంటి దుస్థితి ఏ తల్లికి రాకూడదని ఆమె ఆవేదన వ్యక్త చేస్తూ కన్నీరు పెట్టుకుంది. మృతుడి అక్క ఇంటర్ చదువుతోంది. తమ్ముడు చితికి తల్లి తలకొరివి పెట్టడం చూసిన అక్క తల్లడిల్లిపోయింది. యోగి అంతిమయాత్రకు యువకులు, కుటుంబసభ్యులతో పాటు తోటి స్నేహితులు భారీగా తరలివచ్చారు.

# పలాసలో పెట్రోల్ కొరత లేదు

### - జనసేన నాయకుడు ధర్మారావు



**పలాస, ఏప్రిల్ 29 (వార్త):** పలాస నియోజకవర్గంలో పెట్రోల్ బంకులలో పెట్రోలు డీజిల్ విచ్చలవిడిగా దొరుకుతుందని, వాహదారులు గమనించాలని, కేవలం పలాస నియోజకవర్గంలో మాజీ మంత్రి అప్పలరాజు తన రాజకీయాల్లో తన ఉనికిని కాపాడడానికి కోసం మాత్రమే డీజిల్ పెట్రోల్ బంకుల్లో దొరకట్లేదని తప్పుడు సమాచారాన్ని ప్రజల్లో ప్రచారం చేస్తున్నారని పలాస మున్సిపాలిటీకి చెందిన మున్సిపాలిటీ జనసేన నాయకులు నందిగామ ధర్మారావు స్పష్టం చేశారు. బుధవారం పలాసలోని పలు పెట్రోల్ బంకులను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ నిల్వలు తగినంతగా ఉన్నాయని కేంద్ర పెట్రోలియం శాఖ ప్రకటించిందని,

సరఫరా నిరంతరాయంగా సాగుతోందని, ప్రజలు భయాందోళనలకు గురికావద్దని పౌరసరఫరాల శాఖ అధికారులు సూచించారని ఆయన తెలిపారు. అనవసరమైన ఆందోళన వల్ల ఏర్పడే రద్దీని తగ్గించాలని, అవసరానికి మించి ఇంధనాన్ని నింపుకోవాల్సిన అవసరం లేదని ప్రజలను కోరారు. పెట్రోల్ బంకుల్లో పూర్తిస్థాయిలో నిలవాలు ఉన్నాయని, పెట్రోల్ బంకుల్లో పెట్రోల్ బంకు స్టాఫ్ ని డీజీలు కొనుగోలు చేస్తున్నారా,? లేదా?అని సమాచారం తెలుసుకొనగా పెట్రోలు డీజిల్ కి ఎటువంటి అభ్యంతరాలు లేవని, అవసరం మేరకు పెట్రోల్ డీజిల్ దొరుకుతుందని, పెట్రోల్ బంక్ సిబ్బంది చెప్పారు. ఎటువంటి అపోహలకు త్రావివ్వకుండా పెట్రోల్ బంకుల్లో మరో రెండు రోజుల వరకు పూర్తిస్థాయిలో నిల్వ ఉందని, రానున్న రోజుల్లో కంపెనీలకు ఆర్డర్ పెడతామని, పూర్తిస్థాయిలో సరఫరా చేయడం జరుగుతుందని బంకు సిబ్బంది తెలిపారు. నందిగాం ధర్మారావు క్షేత్ర పర్యటనలో పరిశీలించి ఈ మేరకు తెలిపారు. రాజకీయ ఉనికి కోసం కొంతమంది అపోహాలు సృష్టిస్తున్నారని, ఇటువంటి వాదంతులు నమ్మకుండా ప్రజలు ధైర్యంగా ముందుకు వెళ్లాలని కోరారు. భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు నేపథ్యంలో మధ్యప్రాచ్య (మిడిల్ ఈస్ట్) దేశాల్లో నెలకొన్న అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయంగా ఇంధన సరఫరాపై ప్రభావం పడుతుందనే ఆందోళనలు సోషల్ మీడియాలో చర్చకు దారితీశాయని చెప్పారు. గుజరాత్ వంటి కొన్ని ప్రాంతాల్లో సరఫరాలో తలెత్తిన తాత్కాలిక అంతరాయాల వార్తలను ఆసరాగా చేసుకుని, దేశవ్యాప్తంగా కూడా అదే పరిస్థితి రాబోతోందనే అపోహలను కొందరు వ్యాప్తి చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. చెల్లింపు విధానాల్లో మార్పులు రావడంతోనే పెట్రోల్ బంకుల యజమానులకు చమురు కంపెనీలు కొత్త నిబంధనలను అమలు చేయడంతో కొన్ని చోట్ల ఇంధన సరఫరాలో తాత్కాలిక అంతరాయం ఏర్పడిందని, డీలర్లు ముందుగా నగదు చెల్లిస్తేనే స్టాక్ సరఫరా చేస్తామనే కంపెనీల నిబంధనల వల్ల, ఆర్థిక సర్దుబాట్లు చేసుకోలేక కొన్ని బంకులు తాత్కాలికంగా మూతపడటం వల్ల కూడా ప్రజల్లో ఆందోళన పెరిగిందని తెలిపారు.

## బాటసారుల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ పంపిణీ

**పలాస, ఏప్రిల్ 29 (వార్త):** పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం ఘనంగా చేపట్టారు. మజ్జిగ పంపిణీ కార్యక్రమం చివరి రోజు సందర్భంగా బాటసారుల దాహార్తిని తీర్చేందుకు ప్రత్యేకంగా ఈ సేవా కార్యక్రమాన్ని కళాశాల మెయిన్ గేటు వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 530 మందికి పైగా బాటసారులు, వృద్ధులు, విద్యార్థినులు, విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వేసవి కాలంలో ఇలాంటి మజ్జిగ పంపిణీ కార్యక్రమాలను నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతున్నదని తెలిపారు. ప్రజల ఆరోగ్యం, శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ఇటువంటి సేవా కార్యక్రమాలలో విద్యార్థులు పాల్గొనడం ఎంతో అవసరమని సూచించారు. ఈ కార్యక్రమానికి బాటసారులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. 9కార్యక్రమానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని కామర్స్ లెక్చరర్, సైన్స్ విభాగ అధ్యక్షులు ఎన్. శ్రీనివాస్ పట్నాయక్ అందించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ .పి. వెంకటరమణ, డాక్టర్ వై. వెంకటలక్ష్మి, డాక్టర్ పి. మధు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.




## తాళ్లపాక అన్నమయ్య జయంతి ఉత్సవాలు జయప్రదం చేయండి

**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 29 (వార్త):** మశాఖపురం గ్రామంలో మే 1 శుక్రవారం నిర్వహిస్తున్న తాళ్లపాక అన్నమాచార్య జయంతి ఉత్సవాలు మహతి సాంస్కృతిక కళాసేవ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు రంగాల జానకిరామ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి సుమారు 200 మంది కళాకారులు పాల్గొని, ఉదయం 7 గంటలకు స్వామి వారి చిత్రపటం ఊరేగింపు కార్యక్రమంలో సంతోషిమాత జానపద కోలాట బృందం తోటూరు పాల్గొంటారని, భాజా భజంత్రీలతో లతో ఘనంగా తిరువీధి ఉంటుందని, వెంకటేశ్వర స్వామి పై అపారమైన భక్తితో రాసినటువంటి అన్నమయ్య కీర్తనలు ఆరోజు స్వామివారికి నీరాజనంగా పాడుతూ, అన్నమయ్య సప్త కీర్తన గానం సామూహికంగా నిర్వహించడం, జరుగుతుందని చెప్పారు. ఆల్ ఇండియా ఏ గ్రేడ్ కళాకారులు శిఖామణి భాగవతారని విజయవాడ చే అద్భుతంగా హరికథ గానం జరుగుతుందని, అలాగే పాల్గొన్న కళాకారులకు సన్మాన సత్కారాలు విచ్చేసిన అతిధుల చేతుల మీదుగా ఉంటుందని, అల్పాహారం భోజనం సదుపాయం ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు.



## హరిపురంలో ఇంటింటికీ వెళ్లి.. బయోమెట్రిక్ చేసిన డీలర్ మూర్తి



**మందస, ఏప్రిల్ 29(వార్త):** హరిపురంలో బుధవారం ఇంటింటికీ వెళ్లి.. 25వ రేషన్ డిపో డీలర్ వైఎస్ఎన్ మూర్తి బయోమెట్రిక్ ను చేయించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు 65సంవత్సరాలు దాటిన వృద్ధులు, దివ్యాంగులు, కదలలేని మెడికల్ ప్రాబ్లెమ్ గల వారికి రేషన్ ఇవ్వడానికి ఇంటింటికీ వెళ్లి బయోమెట్రిక్ లను తీసుకున్నారు. వీరికి డిపోల రేషన్ ను అందజేస్తామని డీలర్ వైఎస్ఎన్ మూర్తి చెప్పారు.

## చల్లవానిపేటలో పశువుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట

### - వాహనం స్వాధీనం



**జలుమూరు, ఏప్రిల్ 29 (వార్త):** జలుమూరు మండలంలోని చల్లవానిపేట వద్ద అక్రమంగా తరలిస్తున్న పశువుల రవాణాను పోలీసులు అడ్డుకున్నారు. ఈ విషయాన్ని స్థానిక ఎస్సై పి. అశోక్ బాబు వెల్లడించారు. మంగళవారం సాధారణ తనిఖీలలో భాగంగా అనుమానాస్పదంగా వెళుతున్న బొలెరో వాహనాన్ని పోలీసులు ఆపి తనిఖీ చేయగా, అందులో ఆరు పశువులు ఉన్నట్లు గుర్తించారు. వాహనం బలద సంత నుంచి నారాయణవలస సంతకు వెళుతున్నట్లు వాహన యజమాని పట్ట గోవిందరావు తెలిపినట్లు ఎస్సై పేర్కొన్నారు. అయితే సరైన పత్రాలు లేకపోవడం, అక్రమ రవాణా అనుమానాల నేపథ్యంలో వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, పశువుల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటువంటి కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, ప్రజలు కూడా అనుమానాస్పద ఘటనలను పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# జనగణనకు సహకరించండి



**సోంపేట, ఏప్రిల్ 29 (వార్త):** మే ఒకటి నుంచి ప్రారంభం కానున్న ప్రతిష్టాత్మకమైన జనగణన కార్యక్రమాన్ని విజయవంతం అయ్యేందుకు సోంపేట మేజర్ పంచాయతీ ప్రజలు సహకరించాలని ఈఓ శాంతకుమారి కోరారు. ఆమె బుధవారం మాట్లాడుతూ 16 వ జనగనన కార్యక్రమం మే 1 నుంచి మే 30 వరకు మొదటి దశలో ప్రభుత్వం నిర్వహిస్తుందని అన్నారు. ఇంటింటికి వచ్చే అన్యుమరేటర్లకు ఆయా కుటుంబీకులు సహకరించాలని కోరారు. వారు అడిగిన సమాచారం కచ్చితంగా ఇవ్వాలని సూచించారు. జన గణనలో ఒక్క కుటుంబానికి 34 ప్రశ్నలు అడగడం జరుగుతుందని అన్నారు.

# ఎన్నో ఏళ్ల కల.. ఈడేరిన వేళ!

**- సీతంపేట గ్రామ దేవత జడ్డమ్మ తల్లి గుడికి రహదారి ఏర్పాటు -సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, వజ్రపుకొత్తూరు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కర్ని రమణ - సుమారు కిలోమీటర్ గ్రావెల్ రోడ్డు నిర్మాణం**

**- ఎమ్మెల్యే శిరీష దృష్టిలో పెట్టి శాశ్వత సీసీ రోడ్ ఏర్పాటుకు కృషి**



**పలాస, ఏప్రిల్ 29 (వార్త):** వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం పంచాయతీ పరిధిలోని సీతంపేట గ్రామంలో ఎన్నో సంవత్సరాలుగా గ్రామ దేవత జడ్డమ్మ తల్లి అమ్మవారి గుడికి రహదారి సౌకర్యం లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ వచ్చారు. పండుగలు, ప్రత్యేక కార్యక్రమాల సమయంలో భక్తులు గుడికి చేరుకోవడం కష్ట సాధ్యంగా మారేది. ముఖ్యంగా వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉండేది. గ్రామ దేవతపై ఉన్న అపారమైన భక్తి ఉన్నప్పటికీ, సరైన మార్గం లేక ఎంతో బాధతో గుడికి వెళ్లాల్సి వచ్చేది. "అమ్మవారిని దర్శించుకోవడం కూడా ఒక పరీక్షలా మారింది" అని గ్రామ పెద్దలు పలుమార్లు వాపోయినా, గతంలో ఎవరూ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేక పోయారు. ఈ పరిస్థితిని గమనించిన రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, వజ్రపుకొత్తూరు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కర్ని రమణ ముందుకు వచ్చారు. మే నెలలో జరగబోయే గ్రామ సంబరాలను దృష్టిలో ఉంచుకుని, గ్రామ రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సహకారంతో గ్రామ దేవత గుడికి సొంత ఖర్చులతో శాశ్వత గ్రావెల్ రహదారిని ఏర్పాటు చేయించారు. ఎమ్మెల్యే గౌతు శిరీష దృష్టిలో పెట్టి శాశ్వత సిసి రోడ్డుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ రహదారి ఏర్పాటుతో గ్రామ ప్రజల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఈ కల నెరవేరడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామస్తులు భావోద్వేగంతో మాట్లాడుతూ "ఎన్నో సంవత్సరాలుగా ఎందరో నాయకులు వచ్చారు, మాటలు ఇచ్చారు కానీ పని జరగలేదు. బుధవారం పుచ్చ ఈశ్వరరావు, కర్ని రమణ కృష్ణార్జునుల్లా ముందుకు వచ్చి మా సమస్యను పరిష్కరించారు" అని ప్రశంసించారు. "ఇది కేవలం రహదారి కాదు... మా అమ్మవారితో మాకు కలిసే బంధం.

ఇకపై ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి ఒక్కరూ సులభంగా దర్శనం చేసుకోగలుగుతారని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ ఉపకారం మేము ఎప్పటికీ మర్చిపోలేం" అంటూ గ్రామస్తులు కృతజ్ఞతాభివందనలు తెలిపారు.



## లింగాలవలసలో ..
# పారిశుద్ధ్య పనుల పరిశీలన

**- అధికారులు అప్రమత్తంగా ఉండాలి : బాలగోపాల్**



**జలుమూరు, ఏప్రిల్ 29 (వార్త):** జలుమూరు మండలం లింగాలవలస-- చల్లవానిపేట గ్రామ పంచాయతీ అధ్వర్యం లో "స్వచ్ఛ పథం" కార్యక్రమాన్ని డీపీఓ ఆర్ గోపీబాల బుధవారం ప్రారంభించారు. పంచాయతీ రాజ్ కమిషనర్ టీసీ ఆదేశాల మేరకు ప్రతి బుధవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. గ్రామాల మధ్య రహదారుల ఇరువైపులా ఉన్న చెత్త కుప్పలను తొలగించి పరిశుభ్రతను కాపాడాలని తెలిపారు. పంచాయతీ పరిధిలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను జిల్లా పంచాయతీ విస్తరణ అధికారి బాలగోపాల్ బుధవారం పరిశీలించారు. గ్రామాల్లో కొనసాగుతున్న పరిశుభ్రత కార్యక్రమాల అమలును సమీక్షిస్తూ, పనులను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లో నిరంతరం పరిశుభ్రత కార్యక్రమాలు కొనసాగించేలా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చెత్త నిర్వహణ, కాలువల శుభ్రత వంటి అంశాలలో నిర్లక్ష్యం ఉండకూడదని హెచ్చరించారు. ఈ పరిశీలనలో ఎంపీడీవో చిన్నముడు, ఈవోపీఆర్డీ ఉమా మహేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీఓ, తదితర సిబ్బంది పాల్గొన్నారు.



# దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి



**పలాస, ఏప్రిల్ 29 (వార్త):** దళిత క్రైస్తవులకు ఎస్ సి హోదా కల్పించాలని దళిత ప్రజా సంఘాల ఐక్యవేదిక, కులనిర్మూలనా పోరాట సమితి సంయుక్తంగా రౌండ్ టేబుల్ సమావేశములో నిర్ణయించింది. బుధవారం పలాస ఎస్ సి, ఎస్టీ రైల్వే ఉద్యోగుల భవనంలో దళిత ప్రజా సంఘాల ఐక్యవేదిక, కులనిర్మూలనా పోరాట సమితి సంయుక్తంగా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. దళితుల మత స్వాతంత్ర్య హక్కును హరించి వేస్తున్న రాష్ట్రపతి ఉత్తర్వులు (1950 )లోని మూడవ పేరాను సవరించి దళిత క్రైస్తవులకు యస్సీ హోదా కల్పించాలి కుల ధృవీకరణకు మత ప్రాతిపదికను తొలగించే విధంగా ఉద్యమించాలనిఈ రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా కులనిర్మూలనా పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్క.కృష్ణయ్య మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు ఎస్సిల్లో చేర్చాలని 1948లో అంబేద్కర్ క్రైస్తవులుగా మారిన యస్సిలకు రిజర్వేషన్స్ ఉండాలని అంశాన్ని రాజ్యాంగ సభ ముందు చర్చకు పెట్టిన సందర్భంగా దళితేతరుడైన పార్లమెంట్ సభ్యుడు మ్యాధ్యు క్రైస్తవులకు ప్రభుత్వం ముందు నిలబడి బిచ్చమెత్తుకొనే స్థితిలో లేరు, మాకు రిజర్వేషన్స్ అవసరంలేదని, అనడంతో అంబేద్కర్ ఏమి అనలేని స్థితి ఏర్పడిందని చెప్పారు. మెజారిటీ హిందూ నాయకులు మ్యాధ్యు నీ సమర్ధించి దళిత క్రైస్తవులుకు అన్యాయశీ జరిగిందఅట, ఆనాటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ నియమించిన బిసి కమిషన్ నివేదికలో దళిత క్రైస్తవులకు రిజర్వేషన్లు కల్పించాలని సూచన చేసింది.అంతేకాదు 1979లో ఏర్పడిన మండల కమీషన్ 1980లో నియమించిన మైనారిటీ కమిషన్లు కూడా దళిత క్రైస్తవుల దయనీయ స్థితిగతుల గురించి ఆయా నివేదికల ద్వారా ప్రభుత్వానికి తెలియజేశాయి. దళితులు ఏ మతం మారిన వారి సామజిక హోదా కానీ ఆర్థిక పరిస్థితి మారలేదని, నివేదికలు ఇచ్చిన ఏ ప్రభుత్వం అమలు చేయకుండా దళితులకు అన్యాయం చేశారని అన్నారు. దళిత హక్కుల పరిరక్షణ సంఘం నాయకుడు పి. కృష్ణారావు మాట్లాడుతూ దళిత క్రైస్తవుల స్థితి గతులు ఏవిధంగా ఉన్నాయో తెలియజేయాలని మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి కె జి బాలకృష్ణన్ తో కమీషన్ వేసిందని, వాటిపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని అన్నారు. ఈలోగా అదే న్యాయస్థానం దళిత క్రైస్తవుల ఎస్సీ హోదా రద్దు చేస్తూ ఇచ్చిన తీర్పు దేశ వ్యాప్తంగా దళిత క్రైస్తవుల హక్కులు హరించే విధంగా ఉందని అన్నారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర నాయకుడు పత్తిరి. దానెసు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం భారత రాజ్యాంగ చట్టం (షెడ్యూల్డ్ కులాలు) 1950,మూడవ పేరాలో రాజ్యాంగం కల్పించిన సౌకర్యాలను వినియోగించుకోవాలంటే ఆ షెడ్యూల్డ్ కులస్థులు హిందూ మతం వారై ఉండాలనే షరతు విధించిందని, సిక్కు, బౌద్ధ, జైన మతంలో ఉండే దళితులు కూడా రిజర్వేషన్ సౌకర్యం పొందవచ్చునని, కేవలం క్రైస్తవ, ఇస్లాం మతాలలో వున్న దళితులకు మాత్రం ఎస్సీలకు కల్పించే సౌకర్యాన్ని ఆ చట్టం నిరాకరిస్తుంది. అంటే ఎస్సీలు రిజర్వేషన్ ఫలాలు పొందాలంటే అనివార్యంగా వారు హిందూ మతంలోనే ఉండాలి. లేదా సిక్కు, బౌద్ధ, జైన మతంలోనైనా వుండవచ్చు అనే మనువాద కుట్రలు పన్నుతున్నారని అన్నారు. ఈ సమావేశంలో నల్ల. హడ్డి, అమరుల బంధుమిత్రుల సంఘం నాయకులు జోగి. కోదండం,దళిత నాయకులు పద్మాలోచన, దుర్యోధన, శంకరరావు, ప్రగతిశీల కార్మిక సంఘం నాయకుడు పుచ్చ. దుర్యోధన, దేవడ నారాయణ, క్రిస్టియన్ సంఘం నాయకుడు మురళీప్రకాష్, దేశభక్త ప్రజాతంత్ర నాయకులు గంగయ్య, పౌరహక్కుల నాయకులు జోగారావు, వైకుంఠరావు, మహిళ నాయకులు నాగమణి, కులనిర్ములనా పోరాట సమితి జిల్లా అధ్యక్షులు బెలమర ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# నరసన్నపేటలో ఇంధన రద్దీ తగ్గుముఖం

**నరసన్నపేట,ఏప్రిల్ 29 (వార్త):** నరసన్నపేటలోని పెట్రోల్ బంకుల వద్ద గత రెండు రోజులుగా కనిపించిన రద్దీ బుధవారం తగ్గుముఖం పట్టింది. పెట్రోల్, డీజిల్ సరఫరాపై నెల కొన్న ఆందోళన క్రమంగా తగ్గి సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లా కలెక్టర్ మంగళవారం సాయంత్రం నరసన్నపేటలో పరిస్థితిని సమీక్షించి, రెవెన్యూ, పోలీస్, పెట్రోల్ బంక్ సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చారు. సరఫరా వ్యవస్థను సక్రమంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో బుధవారం నాటికి ఇంధన సరఫరా సజావుగా సాగుతూ, ప్రజల్లో ఉన్న భయం తగ్గినట్లు కనిపిస్తోంది. వాహనదారులు కూడా సాధారణంగా ఇంధనం నింపించుకుంటూ పరిస్థితి స్థిరపడినట్లు భావిస్తున్నారు.



# ఆర్టీసీ కాంప్లెక్స్‌లో డాగ్ స్క్వాడ్ తనిఖీలు

**- మాదక ద్రవ్యాల నియంత్రణకు పోలీసుల చర్యలు**



**నరసన్నపేట, ఏప్రిల్ 29(వార్త):** నరసన్నపేట ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బుధవారం డాగ్ స్క్వాడ్‌లతో పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్ఐ గణేష్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో ఉన్న షాపులు, పార్సెల్ సెంటర్లలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టే లక్ష్యంతో ప్రయాణికుల బ్యాగులను కూడా పరిశీలించారు. అనుమానాస్పద వస్తువులపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ తనిఖీల వల్ల ప్రజల్లో భద్రతాభావం పెరిగిందని అధికారులు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి తనిఖీలు కొనసాగిస్తామని తెలిపారు.

# రైతులకు ఉచితంగా జింక్ సల్ఫేట్ పంపిణీ

**- భూసారం పెంపునకు చర్యలు**



**నరసన్నపేట, ఏప్రిల్ 29(వార్త):** రైతులకు జింక్ సల్ఫేట్‌ను ఉచితంగా అందజేస్తామని వ్యవసాయ శాఖ అధికారిణి వై. సూర్యకుమారి తెలిపారు. బుధవారం నరసన్నపేట వ్యవసాయ కార్యాలయంలో ఆమె ఈ విషయాన్ని వెల్లడించారు. ఇటీవల భూసార పరీక్షలు నిర్వహించగా, సుమారు 200 మంది రైతుల భూముల్లో జింక్ లోపం ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయా రైతులకు జింక్ సల్ఫేట్‌ను పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. జింక్ సల్ఫేట్ వాడకం ద్వారా భూసారం మెరుగుపడి పంటల దిగుబడి పెరుగుతుందని ఆమె వివరించారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని భూసారాన్ని పెంచుకోవాలని సూచించారు.

# చెత్త సంపద కేంద్రం పక్కనే వ్యర్థాల పారవేత

**- అధికారుల నిర్లక్ష్యంపై ఆరోపణలు**



**నరసన్నపేట, ఏప్రిల్ 29(వార్త):** నరసన్నపేటలోని చిన్న కరగాం ప్రాంతంలో తడి, పొడి చెత్త కోసం ఏర్పాటు చేసిన సంపద కేంద్రం పక్కనే వ్యర్థాలను పారవేయడం స్థానికులకు ఇబ్బందులు కలిగిస్తోంది. చెత్తను కేంద్రంలో భద్రపరచాల్సి ఉండగా, బయటే పడేస్తుండటంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రహదారికి ఆనుకుని ఉన్న ఈ ప్రాంతంలో వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్వాసన వ్యాపించి స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిశుభ్రత కార్యక్రమాల అమలులో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. చెత్త నిర్వహణలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుని, సంపద కేంద్రాలను సక్రమంగా వినియోగించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# దెబ్బతిన్న కంబకాయ రహదారి

**- వాహనదారులకు ఇబ్బందులు**

**నరసన్నపేట, ఏప్రిల్ 29(వార్త):** నరసన్నపేట కేంద్రం నుంచి కంబకాయ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి శిథిలావస్థకు చేరుకోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు చోట్ల రహదారి విచ్ఛిన్నమై గుంతలు ఏర్పడటంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ఈ రహదారిపై ప్రయాణించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి ద్వారా కొండ జలుమూరు మండలానికి వెళ్లే వాహనదారులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో ప్రయాణిస్తుంటారు. అయినప్పటికీ రహదారి మరమ్మతులు చేపట్టకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తమవుతోంది. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే రహదారి మరమ్మతులు చేపట్టి ప్రజలకు సౌకర్యవంతమైన రాకపోకలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# నరసన్న చెరువులో భారీ ఆక్రమణ

**- అధికారులపై ప్రజల ఆగ్రహం**

**నరసన్నపేట, ఏప్రిల్ 29(వార్త):**నరసన్నపేట ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురు ఉన్న నరసన్న చెరువులో భారీగా ఆక్రమణలు జరుగుతున్నాయని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. చెరువు గర్భాన్ని కొంతమంది అక్రమార్కులు రాత్రింబగళ్లు మట్టి వేసి కప్పేస్తున్నారని వారు మండిపడుతున్నారు. ఈ అక్రమాలను అడ్డుకోవాల్సిన రెవెన్యూ, పంచాయతీ అధికారులు స్పందించకుండా, సహకరిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. పట్టణానికి కీలకమైన చెరువు ఆక్రమణకు గురవుతున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. చెరువును పరిరక్షించి ఆక్రమణలను వెంటనే అడ్డుకోవాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు ఉన్నతాధికారులను కోరుతున్నారు.



## మే డేన మెగా ఉచిత వైద్య శిబిరం

**పలాస, ఏప్రిల్ 29 (వార్త):** మే డే సందర్భంగా పలాస జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంప్ మే డే కార్మిక దినం పురస్కరించుకుని 01.05.2026 శుక్రవారం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జర్నలిస్ట్ అసోసియేషన్ కార్యాలయం ప్రాంగణంలో జరుగునని పలాస ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు సిహెచ్ నేతాజీ ప్రకటనలో తెలియజేశారు. ఎవరికైనా సందేహాలు ఉంటే కాంటాక్ట్ నెంబర్ 7981088011, 9553868818 నంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ మెగా ఉచిత వైద్య శిబిరంలో ఉచిత మందులతో పాటు, వికలాంగులకు, వృద్ధులకు అవసరం మేరకు రవాణా సదుపాయం కల్పిస్తామని తెలిపారు. ప్రెస్ క్లబ్ ప్రాంగణంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

## నిత్యాన్నదానానికి తొలి అడుగు

**-శ్రీముఖలింగేశ్వర ఆలయంలో నిత్యాన్నదానానికి విరాళాలు**




**జలుమూరు, ఏప్రిల్ 29 (వార్త):** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగేశ్వర స్వామి ఆలయంలో నిత్య అన్నదాన కార్యక్రమానికి విరాళాలు అందుతున్నాయి. ఆలయ ప్రధాన అర్చకుడు నాయుడు గారి రాజశేఖర్ తొలి అడుగు గా బుధవారం 25 కేజీల బియ్యం ప్యాకెట్‌ను ఎండోమెంట్ ఈవో ఏడుకొండలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆలయంలో గర్భగుడిలోని కుండీలో భక్తులు సమర్పించే బియ్యంలో ఒక భాగాన్ని నిత్య అన్నదానానికి వినియోగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. భక్తులు ఇచ్చే విరాళాలను సక్రమంగా స్వీకరించి, అన్నదానానికి ఉపయోగించనున్నట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ఎండోమెంట్ ఈవో ఏడుకొండలు మాట్లాడుతూ, అన్నదానం కోసం భక్తులు వస్తువులు లేదా నగదు రూపంలో విరాళాలు ఇస్తే తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సూచించారు. నేరుగా ఆలయ అధికారులను సంప్రదించి మాత్రమే విరాళాలు అందజేయాలని, మధ్యవర్తుల ద్వారా ఇవ్వవద్దని స్పష్టం చేశారు. అన్నదాన కార్యక్రమానికి గ్రామస్తులు, గ్రామ పెద్దలు, ఎండోమెంట్ అధికారులు, ఆలయానికి వచ్చే భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా దాతలు వస్తు రూపంలో నేరుగా అన్నదానానికి సహాయం చేయవచ్చని, లేదా నగదు రూపంలో అందజేయాలనుకుంటే ఎండోమెంట్ ఈవోను మాత్రమే సంప్రదించాలని అధికారులు కోరారు.

## దక్షిణాసియా గోల్ షాట్‌బాల్‌లో విజేతగా వెంకటేశ్



**సారవకోట, ఏప్రిల్ 29 (వార్త):** సారవకోట గ్రామానికి చెందిన బొద్దాన వెంకటేశ్ దక్షిణ ఆసియా గోల్ షాట్ బాల్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచి ప్రాంతానికి గౌరవం తీసుకొచ్చాడు. శ్రీలంకతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత జట్టు గెలుపొందగా, ఆ జట్టులో వెంకటేశ్ కీలక పాత్ర పోషించాడు. ఈ నెల 24 నుంచి 26 వరకు శ్రీలంక రాజధాని కొలంబోలో నిర్వహించిన దక్షిణ ఆసియా గోల్ షాట్ బాల్ పోటీలకు భారత జట్టు తరపున వెంకటేశ్ ఎంపిక కావడం విశేషం. తన ప్రతిభతో జట్టుకు విజయాన్ని అందించడంలో భాగస్వామ్యమయ్యాడు. గ్రామీణ ప్రాంతానికి చెందిన యువకుడు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుకోవడం పట్ల స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వెంకటేశ్ విజయంపై గ్రామస్థులు, క్రీడా ప్రియులు అభినందనలు తెలియజేస్తున్నారు.

## ప్రభుత్వ మహిళా కళాశాలలో 6వ సెమిస్టర్‌లో శత శాతం ఉత్తీర్ణత



**శ్రీకాకుళం, ఏప్రిల్ 29 (వార్త):** నగరంలోని ప్రభుత్వ మహిళా (స్వయం ప్రతిపత్తి) కళాశాలలో 2023–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. సూర్యచంద్ర రావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ టి. ఆదిలక్ష్మి కలిసి ఈ ఫలితాలను అధికారికంగా ప్రకటించారు. ఈ ఫలితాల్లో కళాశాల విద్యార్థినులు అద్భుత ప్రతిభ కనబరిచారు. బి.ఏ, బి.కాం, బి.ఎస్సీ విభాగాల్లో నూరు శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఓవరాల్‌గా కళాశాల మొత్తం ఫలితాల్లోనూ 100 శాతం సాధించడం విశేషం. 2023–25 అడ్మిటెడ్ బ్యాచ్‌లో మొత్తం 417 మంది విద్యార్థినులకు గాను, ఇప్పటివరకు 330 మంది (79.23%) విజయవంతంగా డిగ్రీ పట్టభద్రులయ్యారు. కేవలం అకడమిక్ పరీక్షల్లోనే కాకుండా, ఇంటర్న్‌షిప్‌లో కూడా విద్యార్థినులు 100 శాతం ఫలితాలు సాధించడం పట్ల ప్రిన్సిపాల్ సూర్యచంద్ర రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ ఘనత సాధించడానికి కృషి చేసిన అధ్యాపక బృందాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. చిన్నారావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. పద్మావతి, డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ పి.ఎస్. కనకదుర్గ, వై. ప్రశాంతి పాల్గొన్నారు. అలాగే డేటా ఎంట్రీ ఆపరేటర్లు పి. సంతోష్, జి. శశికాంత్, బి. శ్రావణి ఇతర బోధన, బోధనేతర సిబ్బంది ఈ ఫలితాల విడుదల కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

## ఎస్.ఎంపురం.పెద్ద చెరువుకు మహర్దశ

**ఎచ్చెర్ల, ఏప్రిల్ 29 (వార్త):** మండలంలోని షేర్ మహమ్మద్ పురం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న 'పెద్ద చెరువు' ఇప్పుడు జలకళను సంతరించుకోనుంది. జల ధార జలహారతి కార్యక్రమం ద్వారా భూగర్భ జలాలను పెంపు లక్ష్యంగా ప్రత్యేక డ్రైవ్ గా పనులు జరుగుతున్నాయి. ఏళ్ల తరబడి సరైన పూడికతీత లేక నీటి నిల్వ సామర్థ్యం తగ్గిన ఈ చెరువుకు పునర్వైభవం కల్పించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2026–27 ఆర్థిక సంవత్సరంలో భాగంగా సుమారు రూ. 9,12,109 అంచనా వ్యయంతో ఈ చెరువు పునరుద్ధరణ పనులను ప్రారంభించారు. మార్చి 30, 2026న మొదలైన ఈ పనులు స్థానిక రైతుల్లో కొత్త ఆశలను చిగురింపజేస్తున్నాయి. ప్రస్తుతం ఈ పెద్ద చెరువు కింద 486 ఎకరాల ఆయకట్టు సాగులో ఉంది. తాజా అభివృద్ధి పనుల వల్ల చెరువు నీటి నిల్వ సామర్థ్యం గణనీయంగా పెరగనుంది. వర్షపు నీటితో పాటు కన్నపు నాయుడు చెరువు మరియు సమీప కొండల నుండి వచ్చే ప్రవాహాలు వృథా కాకుండా నిల్వ చేసేలా ప్రణాళికలు రూపొందించారు. దీనివల్ల అదనంగా మరిన్ని ఎకరాలు సాగులోకి వచ్చే అవకాశం ఉండటమే కాకుండా, గ్రామానికి చెందిన సుమారు 376 మంది రైతులకు శాశ్వత సాగునీటి సౌకర్యం లభించనుంది.

# స్థానిక సంస్థల సమరానికి సిద్ధమా?

**- ఓటర్లు జాబితా ప్రచురణ**

**- ప్రజల్లో ప్రారంభమైన చర్చ**

**- ముందస్తుగా మున్సిపాలిటీ**

**- ఆ తర్వాత పంచాయతీలు**

**- రిజర్వేషన్లపై వీడని ఉత్కంఠ**

**- ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్న ఆశావాహులు**



**పలాస, ఏప్రిల్ 29 (వార్త):** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోంది. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే ఓటర్ల జాబితాను ప్రచురించారు. దీంతో పంచాయతీ ఎన్నికలపై ప్రజల్లో చర్చ ప్రారంభమైంది. మరోవైపు రిజర్వేషన్ పై ఉత్కంఠ ఇంకా వీడలేదు. గ్రామాల్లో మరోసారి పంచాయతీ ఎన్నికలపై ప్రజల్లో తీవ్ర చర్చ కొనసాగుతోంది. పంచాయతీ ఎన్నికలను రెండు, మూడు నెలల్లో నిర్వహించే అవకాశం ఉందని రాజకీయ పార్టీలు అంచనా వేస్తున్నాయి. ఇప్పటివరకు ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని ఉండగా మార్చి నెలాఖరుకు ఆమె పదవి కాలం పూర్తి కావడంతో కొత్త ఎన్నికల కమిషనర్ గా అనిల్ చంద్ర పునీఠాను కూటమి ప్రభుత్వం నియమించింది. గత ఎన్నికల కమిషనర్ వైయస్సార్సీపి ప్రభుత్వం నియమిస్తే, కొత్త ఎన్నికల కమిషనర్ ను కూటమి ప్రభుత్వం నియమించడంతో, పంచాయతీ ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో గ్రామపంచాయతీలకు అనుకున్న షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు జరుగుతాయా? లేక ముందస్తుగా పురపాలక సంఘాలకు ఎన్నికలు జరుగుతాయి? అన్న అంశం పై క్లారిటీ రావాల్సి ఉంది. ఇది ఇలా ఉండగా స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయన్న ప్రచారం జోరు అందుకోవడంతో పోటీ చేసేందుకు ఆశావాహులు ముందస్తుగానే రాజకీయ ఎత్తుగడలతో, వ్యూహాలు, ప్రతి వ్యూహాలు వేసుకుంటున్నారు. ప్రధానంగా పలాస నియోజకవర్గంలో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. తెలుగుదేశం పార్టీ నియోజవర్గ స్థాయి నాయకత్వం ఎన్నికలకు సిద్ధంగా ఉండాలంటూ తెలుగు తమ్ముళ్లకు దశా దిశా నిర్దేశించింది. వైయస్సార్సీపి కూడా గ్రామపంచాయతీ ఎన్నికలు జరిగితే రిజర్వేషన్లు ఖరారు అయిన తరువాత గెలుపు గుర్రాలను బరిలోకి దించేందుకు సిద్ధమవుతోంది. ఇటీవల కాలంలో వైఎస్ఆర్సిపి జిల్లా అధిష్టానం ఆదేశాల మేర నియోజకవర్గస్థాయి సమావేశాలు నిర్వహించి పోటీ చేసే ఆశావాహుల అభిప్రాయాలను, కార్యకర్తల అభిప్రాయాలను కూడా సేకరించినట్లు బోగట్టా. పలాస– కాశీబుగ్గ పురపాలక సంఘం విషయంలో మాత్రం ఆశావాహులు కొందరు ముందుకు వస్తున్నప్పటికీ, గెలుపు గుర్రాల అన్వేషణలో అధిష్టానం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ మాజీ చైర్మన్ బల్ల గిరిబాబుకు రాష్ట్ర మాజీ మంత్రి, పలాస నియోజకవర్గం డాక్టర్ సీది రి అప్పలరాజు మధ్య ఉన్న విభేదాలను తొలగించే విధంగా, మళ్లీ స్నేహపూర్వక వాతావరణం కల్పించే విధంగా వైఎస్ఆర్సిపి సీనియర్ రాష్ట్ర నేత, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు అతి త్వరలో సమన్వయం చేసేందుకు ఒక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ప్రచారం పార్టీలో సాగుతుంది. చైర్మన్ అభ్యర్థి విషయంలో రాష్ట్ర అధిష్టానంపై డాక్టర్ అప్పలరాజు భారం వేసినట్లు విశ్వసనీయ సమాచారం. మిస్టర్ క్లీన్ ఇమేజ్ ఉన్న అభ్యర్థి కోసం పార్టీ అధిష్టానం అన్వేషిస్తున్నట్లు తెలుస్తుంది. తెలుగుదేశం విషయానికి వస్తే కూటమి పార్టీలు భాగస్వామ్యం కావడం వల్ల ఇంకా తగు నిర్ణయం తీసుకోకపోయినప్పటికీ, టిడిపి తరపున చైర్మన్ అభ్యర్థిగా యాదవ సామాజిక వర్గానికి చెందిన లోడగల కామేష్ పేరును ఎమ్మెల్యే గౌతు శిరీష కుటుంబీకులు బలపరుస్తున్నట్లు బోగట్టా. ఓటు బ్యాంకు పరంగా స్థానిక మున్సిపాలిటీలో యాదవ సామాజిక వర్గం ఓటు బ్యాంకు శాతం తక్కువని, ఈ నేపథ్యంలో వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో జిల్లావ్యాప్తంగా ప్రభావితం చేయగల కళింగ సామాజిక వర్గానికి ఈసారి కూడా మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా ఇవ్వాలంటూ ఆ సామాజిక వర్గ పెద్దలు టిడిపి అధిష్టానం ముందు తమ ప్రతిపాదన ముందు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. కళింగ కోమటి సామాజిక వర్గం నుంచి పలాస ఏఎంసీ చైర్మన్ గా ప్రాతినిధ్యం వహిస్తున్న మల్లా శ్రీనివాస్ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా రేసులో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. తెలుగుదేశం పార్టీ నుంచి పలువురు ఆశావాహులు ప్రయత్నం చేస్తున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. టిడిపి నుంచి ఎం నరేంద్ర చిన్ని), గాలి కృష్ణారావు, దువ్వాడ శ్రీకాంత్ టిడిపి నుంచి పలు పేర్లు వినిపిస్తున్న నేపథ్యంలో ఎవరికి మునిసిపల్ కిరీటం లభిస్తుందో తెలియవలసి ఉంది. ఇంకోపక్క సార్వత్రిక ఎన్నికలకు ముందు వైయస్సార్సీపిని వీడి తెలుగుదేశం పార్టీలోకి చేరిన సీనియర్ కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేయాలంటూ ఆయన సామాజిక వర్గమైన కళింగ సామాజిక వర్గ పెద్దలు బాగా ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. జనసేన పార్టీ కూడా క్షేత్రస్థాయిలో ఆ పార్టీకి చెందిన జనసైనికులు ఈసారి తమకు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలంటూ సమావేశాలు నిర్వహిస్తూ గట్టిగా ప్రశ్నిస్తున్నారు. గతంలో 31 వార్డులు ఉండగా ఈసారి 36 వార్డులు కావడంతో, ఆశావాహులు సంఖ్య పెరుగుతూనే ఉంది. వైఎస్ఆర్సిపి మున్సిపల్ ఎన్నికలు జరిగితే ఎటువంటి వ్యూహరచనతో అభ్యర్థులను ఎంపిక చేయాలో ఆచితూచి అడుగు వేసేందుకు నెమ్మదిగా వేచి చూసే ధోరణితో ఉంది. తెలుగుదేశం పార్టీ మున్సిపల్ ఎన్నిక విషయానికి వస్తే ఆ పార్టీ నుంచి ఆశావాహులు ముందస్తుగానే తమ తమ వార్డుల్లో పోటీ చేస్తామంటూ తెర వెనుక నుంచి ప్రచారం చేసుకుంటున్నారు. వైయస్సార్సీపీలో కూడా కొన్ని వార్డుల్లో పోటీ చేసేందుకు తాజా మాజీలు సిద్ధపడుతున్నగాని, ఇటీవల వైయస్సార్సీపి సమావేశంలో రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ అప్పలరాజు మాత్రం నిత్యం ప్రజలతో మమేకమవుతూ, వారి సమస్యలను గుర్తించి, పరిష్కరించి, అభిమానం పొందిన వారికి మాత్రమే పోటీ చేసే అవకాశాలు లభిస్తాయని, కొత్త వారికి కూడా అవకాశాలు వస్తాయంటూ ముక్కు సూటిగా స్పష్టం చేశారు. టిడిపి విషయంలో వార్డు కౌన్సిలర్ అభ్యర్థుల ఎంపికలో తర్జన బర్జన పడుతున్నట్లు తెలుస్తుంది. ఎందుకంటే కూటమి పార్టీలు భాగస్వామ్యమైన బిజెపి, జనసేన పార్టీలకు చెందిన వారికి పొత్తులో భాగంగా ఏవార్డు కేటాయించి, అభ్యర్థిగా అవకాశం ఇస్తారో ఇంకా తేల్చుకోలేని పరిస్థితి ఇక్కడ ఉంది. ఇంకోపక్క మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి విషయంలో మరికొందరు నేరుగా రాష్ట్రమంత్రికి కింజరాపు అచ్చం నాయుడు, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆశీస్సుల కోసం తమ తమ స్థాయిలో ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇంకోపక్క పలాస కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలంటూ ప్రముఖ సామాజిక వేత్త, న్యాయవాది దువ్వాడ శ్రీధర్(బాబా) నేతృత్వంలో కొనసాగుతున్న ఈ పోరాట ఉద్యమం పలాస నియోజకవర్గంలో పాటు మున్సిపాలిటీలో కూడా పుంజుకోవడంతో పలాస జిల్లా ఏర్పాటు చేయాలంటూ కొనసాగిస్తున్న నినాదం మున్సిపల్ ఎన్నికలపై పడి, పట్టణ ప్రజలను ప్రభావితం చేసే పరిస్థితులు లేకపోలేదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఒకవేళ తటస్థవాదులు పలాస జిల్లా కేంద్రం కావాలన్నా నినాదం వైపు మొగ్గుచూపితే ఏరాజకీయపార్టీకి గట్టి దెబ్బ తగులుతుందో చెప్పలేమంటూ, ఎటువంటి పరిస్థితులు ఉత్పన్నం కాకమునుపే పాలకవర్గాలు పలాస జిల్లా కేంద్ర ఏర్పాటుపై స్పష్టం చేయాలంటూ కూటమి పార్టీలో మెజార్టీ శ్రేణులు తమ అధిష్టానం ముందు ఈ అభిప్రాయాన్ని వ్యక్తపరిచినట్లు సమాచారం.




# ఉన్నతాధికారులకు నివేదిస్తా

**- పురావస్తు శాఖ టెక్నీషియన్ శ్రీనివాసరావు**

**-అయ్యప్ప విగ్రహాన్ని పరిశీలించిన పురావస్తు శాఖ**

**మెళియాపుట్టి, ఏప్రిల్ 29 (వార్త):** మెళియాపుట్టి మండల కేంద్రంలో గల స్థానిక షిరిడి సాయిగిరి ఆలయ సమీపంలో ఇటీవల కాలంలో అయ్యప్ప విగ్రహాన్ని బయటపడిన విషయముపై పురావాస్తు శాఖ అధికారుల ఆదేశాల మేరకు పురావస్తు శాఖ టెక్నీషియన్ కే శ్రీనివాసరావు బుధవారం నాడు ఆ ప్రాంతాన్ని సందర్శించి విగ్రహాన్ని పరిశీలించారు. ఇటీవల మండల కేంద్రంలోని యువత కోసం ప్రభుత్వం మంజూరు చేసిన క్రీడా మైదానంలో అయ్యప్ప స్వామి విగ్రహం వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో స్థానిక మెళియాపుట్టి యువకులు, ముల్లేటి శ్రీనివాసఅచారి ఆధ్వర్యంలో పురావస్తు శాఖ కమిషనర్ వారికి అయ్యప్ప స్వామి విగ్రహం ఏ కాలానికి చెందినదో నిర్ధారించాలని ఫిర్యాదు చేశారు. దీంతో ఆ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు బుధవారం నాడు టెక్నీషియన్ శ్రీనివాసరావు బుధవారం నాడు మైదానంలో విగ్రహాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన నివేదికను ఉన్నతాధికారులకు అందివ్వనున్నట్టు తెలిపారు. టెక్నీషియన్ శ్రీనివాసరావు తోపాటు షిరిడి గిరి ఆలయ నిర్వాహకులు కాళ్ల ప్రసాదరావు, ముల్లేటి శ్రీనివాసఆచారి, ఢిల్లీ ప్రధాన్, ఈశ్వరరావు, మన్మధరావు, ప్రసాద్, యువకులు తదితరులున్నారు.



## ఇంటి పన్ను రాయితీని సద్వినియోగం చేసుకోండి

**శ్రీకాకుళం, ఏప్రిల్ 29(వార్త):**నగరపాలక సంస్థ పరిధిలోని ఆస్తి పన్ను దారులు ప్రభుత్వం కల్పించిన వడ్డీ మాఫీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ హనుమంతు కూర్మారావు ఒక ప్రకటనలో కోరారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పాత బకాయిలపై ఉన్న వడ్డీలో 50 శాతం రాయితీని కల్పిస్తూ మున్సిపల్ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసిందని, పన్ను దారులు అసలు మొత్తంతో పాటు రాయితీ పోను మిగిలిన సగం వడ్డీని ఏకకాలంలో చెల్లించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అలాగే 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ముందస్తుగా ఆస్తి పన్ను చెల్లించే వారికి 5 శాతం మినహాయింపు లభిస్తుందని, ఈ సదవకాశాన్ని పొందేందుకు ఈనెల30 ఆఖరి గడువు అని తెలిపారు. నగర ప్రజలందరూ గడువు లోగా పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

## మే 5న రణస్థలంలో మెగా జాబ్ మేళా

**శ్రీకాకుళం, ఏప్రిల్ 29(వార్త):**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మే 5వ తేదీన రణస్థలంలోని శ్రీ సాయి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎచ్చెర్ల నియోజకవర్గ పరిధిలో జరిగే ఈ మేళాలో టాటా ఎలక్ట్రానిక్స్, స్నైడర్ ఎలక్ట్రిక్, మ్యాన్‌కైండ్ ఫార్మా వంటి 14 ప్రముఖ ప్రైవేట్ కంపెనీలు పాల్గొని సుమారు 675 ఖాళీలను భర్తీ చేయనున్నాయి. పదో తరగతి నుంచి డిగ్రీ, బీటెక్ చదివిన 18–30 ఏళ్ల మధ్య వయసున్న యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఎంపికైన వారికి శ్రీకాకుళం, విశాఖపట్నం, హైదరాబాద్, చెన్నై వంటి నగరాల్లో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.అభ్యర్థులు ముందుగా naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవాలని, ఇంటర్వ్యూ రోజున ఉదయం 9 గంటలకే విద్యార్హత పత్రాలు, ఆధార్, రెజ్యూమే, ఫోటోలతో హాజరుకావాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ సూచించారు. ఎంపికైన వారికి పోస్టును బట్టి నెలకు రూ. 10,000 నుండి రూ. 25,000 వరకు వేతనం ఉంటుందని, కొన్ని కంపెనీలు ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కూడా కల్పిస్తాయని, వివరాలకు 8317652552 నంబరును సంప్రదించాలని కోరారు.

## మే 9న జాతీయ లోక్ అదాలత్

**శ్రీకాకుళం, ఏప్రిల్ 29(వార్త):** జిల్లావ్యాప్తంగా మే 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని వివిధ కోర్టుల్లో మొత్తం 19 బెంచీలను ఏర్పాటు చేశామని, రాజీ పడదగ్గ 4,576 కేసులను ఈ అదాలత్ కోసం గుర్తించినట్లు ఆయన తెలిపారు. రాజీ మార్గం ద్వారా ఇరుపక్షాలకు విజయం చేకూరుతుందని దీనివల్ల అటు ధనం ఆదా అవ్వడమే కాకుండా ఇటు సమయం కూడా వృథా కాదని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారమైతే కక్షిదారులు గతంలో చెల్లించిన కోర్టు ఫీజును తిరిగి పొందే వెసులుబాటు ఉంటుందని, ఇది సామాన్యులకు ఎంతో మేలు చేస్తుందని వివరించారు. సమ న్యాయం, సత్వర పరిష్కారమే లక్ష్యంగా సాగే ఈ కార్యక్రమంలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులు, సీనియర్ సిటిజన్ల వివాదాలు, వైవాహిక తగాదాలు, మోటారు వాహన ప్రమాద బీమా కేసులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు న్యాయమూర్తి తెలిపారు. వీటితో పాటు ఎగ్జిక్యూషన్ పిటిషన్లు, అండర్ ట్రయల్ కేసులు కూడా పరిష్కారానికి సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. కోర్టుల చుట్టూ తిరిగే శ్రమ లేకుండా, పరస్పర అంగీకారంతో వివాదాలను ముగించుకుని సత్వర న్యాయం పొందడానికి ఇదొక చక్కని వేదికని, జిల్లాలోని కక్షిదారులు ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

## 8న డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ

**శ్రీకాకుళం, ఏప్రిల్ 29(వార్త):**నగరంలో మే 8న డిజాస్టర్ మేనేజ్మెంట్పై రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించనున్నామని జిల్లా చైర్మన్ పి.జగన్మోహన్‌రావు తెలిపారు. ఈమేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ధ్రువపత్రాలు అందజేస్తామన్నారు. 18 నుంచి 45 ఏళ్ల మధ్య వారు శిక్షణకు హాజరుకావచ్చన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts college wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546